నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

తేకువగల వారు తెలగాణ ప్రజలంత
విశ్వమంతగూడ విస్తుపోవ
సకలజనుల సమ్మె సాగించెనానాడు
స్వీయరాష్ట్రమునకు శీఘ్రముగను

విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 24 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 2-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# ధూమపానంలో..చైనా టాప్

**ఏడాదికి ప్రపంచంలో సగటున 5 ట్రిలియన్ల సిగరెట్ల అమ్మకం**

- అందులో 2.4 ట్రిలియన్ల సిగరెట్లు కాల్చేస్తున్న చైనీయులు
- అంకెల్లేకుండా పెరిగిపోతున్న సిగరెట్ రాయుళ్లు

ప్రపంచవ్యాప్తంగా ధూమపానం అలవాటుపై అవగాహన పెరుగుతుండటంతో సిగరెట్ల వినియోగం రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. కానీ మన పొరుగు దేశమైన చైనాలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా, అత్యంత భయానకంగా మారుతోంది. బీజింగ్ నుంచి తాజాగా విడుదలైన అధికారిక నివేదిక ప్రకారం.. ప్రపంచంలోనే అత్యధికంగా సిగరెట్లు తాగే దేశంగా చైనా అగ్రస్థానంలో నిలిచింది. చైనా జనాభాలో ప్రతి వంద మందిలో 23 మంది చొప్పున (అంటే దాదాపు 23 శాతం మంది) సిగరెట్లకు బానిసలయ్యారు. చైనా మొత్తం జనాభా సుమారు 140 కోట్లు కాగా.. ఇందులో దాదాపు 30 కోట్ల మంది చైనీయులు నిత్యం పొగ తాగుతూ తమ ఊపిరితిత్తులను గుల్ల చేసుకుంటున్నారు.


2 లో



## పశ్చిమాసియాలో మళ్లీ దాడులు

- పరస్పర ఆరోపణలతో వేడెక్కుతున్న వాతావరణం

**న్యూఢిల్లీ**
పశ్చిమాసియాలో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'ఆత్మరక్షణ' పేరుతో ఇరాన్ రాడార్, కమాండ్ కంట్రోల్ కేంద్రాలపై అమెరికా దాడులు చేసింది. అంతర్జాతీయ జలాలలో పనిచేస్తున్న ఎంక్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని, టెహ్రాన్ దుందుడుకు చర్యలకు ప్రతిగానే ఈ దాడులు చేశానని అమెరికా సమర్థించుకుంది. 'ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌ను, రెండు డ్రోన్లను అమెరికా యుద్ధ విమానం ధ్వంసం చేసింది' అని సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇదిలావుండగా ఇరాన్‌లోని సిరిక్ దీవిలో ఉన్న టెలీకమ్యూనికేషన్ టవర్‌పై దాడి చేసేందుకు ఉపయోగించిన అమెరికా వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలియజేసింది.

-మిగతా 2 లో

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం**




- నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్
- మహా సిఎంకు తెలంగాణ అంటే చిన్నచూపు
- తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
- జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్

**ఆదిలాబాద్**
ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం.

-మిగతా 2 లో






## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు


**హైదరాబాద్,**
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు.

-మిగతా 2 లో

## పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

- నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ


2 లో



## దోమలతో గూగుల్ వినూత్న ప్రయోగం..

- అమెరికాలో 6.4 కోట్ల బయో దోమలు రిలీజ్
- దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ వినూత్న ప్రాజెక్టు

**న్యూయార్క్:**
గూగుల్ సంస్థ ఓ వినూత్న ప్రయోగానికి తెరలేపింది. దోమల( ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ సంస్థ పూనుకున్నది . దీనిలో భాగంగా ప్రయోగశాల్లో అభివృద్ధి చేసిన సుమారు 6.4 కోట్ల బయో దోమలను అమెరికాలో రిలీజ్ చేయనున్నది. తొలుత ఈ ప్రాజెక్టును ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో చేపట్టనున్నది. దీని కోసం ప్రభుత్వం అనుమతి కోరింది గూగుల్ సంస్థ. అసలైన దోమల జనాభాను నియంత్రించే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. వ్యాధికారక దోమల జనాభాను తగ్గించనున్నారు. గూగుల్ ప్లానింగ్‌కు చెందిన అంశం ప్రస్తుతం యూఎన్ పర్యావరణ పరిరక్షణ సంస్థ(ఈపీఏ) ఆధీనంలో ఉన్నది. రాబోయే

-మిగతా 2 లో

## ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు



- పేచీ కేవలం అక్కడి నాయకులతోనే
- ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం
- పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్**
ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య

-మిగతా 2 లో

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ 'నీట్-కు సుప్రీం నో !

- సెలవుల తర్వాత విచారిద్దామంటూ వాయిదా




**న్యూఢిల్లీ**
ప్రస్తుతమున్న పెన్ను -- పేపర్ తరహాలో బదులుగా కంప్యూటర్ బేస్డ్ తరహాలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ను ఆదేశించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ దశలో పరీక్ష నిర్వహణా తీరును మార్చడం వల్ల ఆచరణాత్మక ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. పేపర్ లీకయిందనే ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన

-మిగతా 2 లో

# దేశభక్తి సినిమాలో చూపించడం కాదు..

**నిజజీవితంలో చూపించు పవన్ కళ్యాణ్**



పవన్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

- ఆ తరువాతనే నవ నిర్మాణ సభ పెట్టుకోవాలి
- తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడితే సహించం
- ఆయన బీజేపీ ఎజెండా మోయడం శోచనీయం
- హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని

-మిగతా 2 లో



## ఎల్పీజీ ధరల మోత

- వాణిజ్య సిలిండర్‌పై రూ.42 పెంపు
- ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్‌పై రూ.11 వడ్డన
- దేశ ప్రజలకు మోడీ సర్కారు మరో షాక్

**న్యూఢిల్లీ**
కేంద్రంలోని మోడీ సర్కారు ఒకటో తారీఖున దేశ ప్రజలకు మరోసారి షాకిచ్చింది. దేశంలో ఎల్పీజీ ధరలు మళ్లీ పెంచింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.42 పెంచింది. దీంతో ఢిల్లీలో ఒక సిలిండర్ ధర రూ.3,113.50కు చేరింది. అలాగే ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ సిలిండర్‌పై కూడా రూ.11 పెరిగి.. ధర రూ.821.50కు ఎగబాకింది. పెరిగిన ధరల ప్రభావాన్ని వ్యాపార సంస్థలు, చిన్న హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు,

-మిగతా 2 లో

## ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం

- ప్రతికూల శక్తుల నుంచి ?రాష్ట్రాన్ని కాపాడుకోవాలి :
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్ష లు



**హైదరాబాద్**
రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.
రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ఆయన స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ మేరకు కేసీఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో,

-మిగతా 2 లో

# ధూమపానంలో..చైనా టాప్



సగానికి సగం చైనీయులే..
షాకింగ్ విషయమేమిటంటే.. ప్రపంచవ్యాప్తంగా ఒక ఏడాదిలో సగటున 5 ట్రిలియన్ల సిగరెట్లు అమ్ముడవుతుంటే.. అందులో సగానికి సగం అంటే ఏకంగా 2.4 ట్రిలియన్ల సిగరెట్లను కేవలం చైనా ప్రజలే తాగేస్తున్నారు. 2003 నుంచి 2023 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా సిగరెట్ల వినియోగం 26 శాతం తగ్గితే.. అదే సమయంలో చైనాలో మాత్రం ఈ వినియోగం ఏకంగా 39 శాతం పెరగడం అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ధూమపానానికి వ్యతిరేకంగా ఎంత పెద్ద యుద్ధం ప్రకటించినా, చైనాలో పొగ సెగలు మాత్రం అస్సలు తగ్గడం లేదు. సిగరెట్ల వినియోగాన్ని తగ్గించడానికి 2022 లో జిన్‌పింగ్ ప్రభుత్వం సిగరెట్లపై అదనంగా 10 శాతం పన్ను విధించడమే కాకుండా, యువతను ఆకర్షిస్తున్న ఈ-సిగరెట్ల పై కూడా కఠినమైన నిషేధ ఆంక్షలు విధించింది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ చట్టాలు సరిగ్గా అమలు కాకపోవడంతో ఫలితం శూన్యంగా మారింది.

చచచ ప్రభుత్వ ద్వంద్వ నీతితోనే..
డ్రాగన్ దేశంలో ఇన్ని చట్టాలు ఉన్నా సిగరెట్ల వినియోగం తగ్గకపోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రభుత్వ ద్వంద్వ నీతి, భారీ వ్యాపార ప్రయోజనాలేనని నిపుణులు చెప్తున్నారు. చైనాలో సిగరెట్ల ఉత్పత్తి, అమ్మకాల మొత్తం వ్యవహారాలను ప్రభుత్వ అధీనంలోని 'చైనా నేషనల్ టొబాకో కార్పొరేషన్' అనే ఒకే ఒక్క సంస్థ చూసుకుంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పొగాకు కంపెనీ అయిన దీని లాభాలు వింటే ఎవరికైనా మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. కేవలం 2025 ఆర్థిక సంవత్సరంలోనే ఈ కంపెనీ ఏకంగా 244 బిలియన్ డాలర్ల నికర లాభాన్ని ఆర్జించింది.
ఈ కంపెనీ ద్వారా వచ్చే ఆదాయం చైనా ప్రభుత్వ మొత్తం వార్షిక ఆదాయంలో ఏకంగా 7 శాతంగా ఉంది. కరోనా మహమ్మారి సంక్షోభం తర్వాత చైనా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పుడు, దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి ఇదే పొగాకు కంపెనీని చైనా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. ఒకవైపు ప్రజల ఆరోగ్యం కోసం పొగ తాగొద్దని చెప్తూనే.. మరోవైపు ప్రభుత్వ ఖజానా నిండటానికి సిగరెట్ల అమ్మకాలను పరోక్షంగా పెంచడం వల్లే చైనాలో ఈ పొగాకు మహమ్మారిని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తం లో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడెసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

మొదటి తరువాయి

ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు. ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ 'నీట్-కు సుప్రీం నో !

మొదటి తరువాయి

నీట్-యుజి 2026 పరీక్షను మే 12న దేశవ్యాప్తంగా రద్దు చేశారు. సిబిఐ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టింది. జూన్ 21న తాజా విచారణ జరగాల్సి వుంది. పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన బెంచ్ తిరస్కరించింది. జులై వరకు ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆర్‌జెడి ఎంఎల్‌ఎ సుధాకర్ సింగ్ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించింది. సిబిటి తరహాలో పరీక్ష నిర్వహిస్తే పేపర్ లీక్ అయ్యే సమస్య తలెత్తదని పిటిషనర్ వాదించారు. ఇంత తక్కువ కాల వ్యవధిలో పరీక్షను మళ్లీ నిర్వహించడంలో వుండే ఇబ్బందులను ప్రస్తావిస్తూ, వారికి వుండే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని సిబిటి లాంటి అంశాలను తోసిపుచ్చినట్లు బెంచ్ తెలిపింది. పేపర్ లీకయినప్పటికీ మళ్లీ పెన్ను పేపర్ తరహాలోనే పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారా అని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశ్నించగా, పరీక్షల నిర్వహణా అధికారులు ఎదుర్కొనే రవాణా పరమైన ఇబ్బందులను కూడా బెంచ్ ప్రస్తావించింది. అయినా పిటిషనర్ పట్టుబడుతుండడంతో తక్షణమే ఈ అంశాన్ని విచారించలేమని కోర్టు తెలిపింది. కోర్టు పాక్షిక పని దినాలు ముగిసిన తర్వాత దీనిని విచారణకు పెట్టాలంటూ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల తర్వాత విచారిద్దామని బెంచ్ తెలిపింది. ఎన్‌టిఎ పనితీరులో, పోటీ పరీక్షల నిర్వహణలో విస్తృత సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దాఖలై, పెండింగ్‌లో వున్న పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌ను కూడా కలిపారు.

# ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం

మొదటి తరువాయి

ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని హెచ్చరించారు. ప్రతీప శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని స్పష్టం చేశారు.తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని తెలిపారు. తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోవాలనీ, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కోరారు.

# దేశభక్తి సినిమాలో చూపించడం కాదు..

మొదటి తరువాయి

డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ



ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

మొదటి తరువాయి

ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు.
బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.

# పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

**నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ**



హైదరాబాద్
జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు టీఆర్ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ దాడులు

మొదటి తరువాయి

అమెరికా వైమానిక స్థావరం ఉన్న కువైట్‌పై కూడా క్షిపణి, డ్రోన్ దాడులు జరిగాయి. దీంతో ఆ దేశం తన గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేసింది. ఏప్రిల్‌లో కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య అడపాదడపా పోరు జరుగుతూనే ఉన్న విషయం తెలిసిందే.

**ఎంఓయూలో ట్రంప్ మార్పులు**

మరోవైపు అమెరికా'ఇరాన్ మధ్య అవగాహనా ఒప్పం దం (ఎంఓయూ)పై చర్చలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత ఎంఓయూకు కొన్ని మార్పులు సూచిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానిని తిప్పిపంపారు. మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణను కొనసాగించాలని, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని ఎంఓయూలో ప్రతిపాదించారు. తాజా దాడులను అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించిన తర్వాత ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ 'నిజంగా ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ అనుకుంటే అది అమెరికాకు, మాతో ఉన్న వారికి మంచి చేసేదిగా ఉండాలి' అని వ్యాఖ్యానించారు. చర్చలపై ప్రతికూల విమర్శలు చేస్తున్న వారిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు హాయిగా కూర్చోండి. విశ్రాంతి తీసుకోండి. చివరికి అంతా మంచే జరుగుతుంది. ఎప్పుడూ అలాగే జరుగుతుంది' అని తెలిపారు. కాగా ఎఎంఓయూలో ట్రంప్ సూచించిన మార్పులేమిటో తెలియరాలేదు. అయితే ఇరాన్ అణు కార్యక్రమం పైన, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం పైన ఆయన కఠిన వైఖరితో ఉన్నారని అధికారులు చెప్పారు. ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు ఎలాంటి ఆర్థిక వెసులుబాట్లు ఇవ్వాలనే విషయంపై కూడా ట్రంప్ ఆలోచిస్తున్నారని వారు తెలిపారు.

# దోమలతో గూగుల్ వినూత్న ప్రయోగం..

మొదటి తరువాయి

రెండేళ్లలో ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో ల్యాబ్‌లో పెరిగిన మగ దోమలను వాతావరణంలోకి రిలీజ్ చేయనున్నారు.దోమల నియంత్రణ కోసం గూగుల్ సంస్థ డీబగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టును 2014లో ఆవిష్కరించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ వినూత్న ప్రాజెక్టును అప్పట్లో ప్రారంభించారు. రసాయనాలు, క్రిమిసంహారకాలపై ఆధారపడకుండా. . సహజసిద్ధమైన బ్యాక్టీరియా వోల్‌బాచియా పిపెంటిస్ ద్వారా ప్రమాదకర దోమలను అంతం చేయాలని భావిస్తున్నారు. మగ దోమలకు ఆ బ్యాక్టీరియాను ఎక్కిస్తారు. ఆ తర్వాత వాటిని అడవుల్లోకి రిలీజ్ చేస్తారు. అయితే ఆడ, మగ దోమలు కలిసిన తర్వాత వచ్చే గుడ్లు ఫలదీకరణ చెందవని గూగుల్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇక పదేపదే ఈ ప్రయోగం చేపట్టడం వల్ల వ్యాధికారక దోమల జనాభాను తగ్గించే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. కేవలం ఆడ దోమలు మాత్రం మనుషులను కుడుతుంటాయి. ఇక అడవుల్లోకి రిలీజ్ చేసిన మగ దోమలు మనుషులను కుట్టవు. అంటే ఈ ప్రయోగం వల్ల దోమల నుంచి సంభవించే అనర్థాలు తక్కువే అని గూగుల్ సంస్థ చెబుతోంది. ఇంతకీ ఈ ప్లాన్ వర్కౌట్ అవుతుందో లేదో చూద్దాం. గూగుల్ సంస్థ సుమారు 3.2 కోట్ల దోమలను ప్రతి ఏడాది రిలీజ్ చేయాలని భావిస్తున్నది. దీని ద్వారా మొత్తం 6.4 కోట్ల దోమలను పర్యావరణంలోకి రిలీజ్ చేస్తారు. పరిశోధనశాల్లో వోల్బాచియా బ్యాక్టీరియా ఎక్కించిన మగదోమలను దశలవారీగా విడుదల చేయనున్నారు. ఒకవేళ ఈ ప్రాజెక్టుకు అప్రూవల్ దక్కితే, అప్పుడు దోమల నియంత్రణ కోసం అమెరికా చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టు ఇదే అవుతుంది. ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం ఈపీఏ పరిశీలన చేస్తున్నది. పబ్లిక్ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోంది. ఇప్పటి వరకు కచ్చితంగా ఏ ప్రదేశంలో ఆ దోమల్ని రిలీజ్ చేస్తారన్న విషయాన్ని వెల్లడించలేదు. గతంలో ఇలాంటి పద్ధతి ద్వారా దోమల నియంత్రణ చేపట్టినట్లు తెలుస్తోంది. వోల్బాచికా బ్యాక్టీరియా విధానాన్ని అనేక దేశాలు అమలు చేసినట్లు తెలుస్తోంది. ఇదే పద్ధతిలో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకుపైగా దోమలను రిలీజ్ చేసినట్లు గూగుల్ సంస్థ చెబుతోంది. ఈ ప్రయోగం వల్ల దోమల జనాభాను తగ్గించారు. వ్యాధికారక దోమలు కూడా తగ్గాయి.ద

# ఎల్పీజీ ధరల మోత

మొదటి తరువాయి



హాస్టళ్లు వంటి వాణిజ్య వినియోగదారులు నేరుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ అదనపు భారం చివరకు వినియోగదారుల పైనే పడే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో పెరిగిన నిత్యావసర ధరలతో ఆర్థికంగా పెను భారాన్ని మోస్తున్న సామాన్యుడికి.. గ్యాస్ ధరల వరుస వడ్డనలు మరింత షాక్ ఇస్తున్నాయి.

# రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మండల వ్యవసాయ అధికారి సహస్



**మర్రిగూడ, జూన్ 01 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాలు, ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి సహస్ సూచించారు.ఆయన మాట్లాడుతూ, "రైతులు మోసపోకుండా ఉండాలంటే ప్రభుత్వం నుండి అధికారిక లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. అలాగే కొన్న ప్రతిదానికి తప్పనిసరిగా రసీదులు (బిల్లులు) తీసుకొని వాటిని జాగ్రత్తగా భద్రపరచుకోవాలి" అని సూచించారు.రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు, వ్యవసాయ శాఖ నిరంతరం కృషి చేస్తుందని, రైతులు కూడా జాగ్రత్తలు పాటించి నష్టాలను నివారించుకోవాలని ఆయన హితవు పలికారు.

## యువతలో ధూమపానం ప్రమాదాలపై వైద్యాధికారి శాలిని హెచ్చరిక

-ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



**మర్రిగూడ, జూన్ 01 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మర్రిగూడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శాలిని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.డాక్టర్ శాలిని మాట్లాడుతూ, "ధూమపానం, మత్తు పదార్థాల వినియోగం యువతలో పెరుగుతున్నది. ఇవి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దీపక్, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేత



**వెల్దండ, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చేర్యాకర్ గ్రామానికి చెందిన గాండ్ల బాలమణి కుమార్తె వివాహానికి మంజూరైన రూ.1,00,116 విలువైన కల్యాణ లక్ష్మి చెక్కును గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, తహసిల్దార్ కార్తీక్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లు భారంగా మారకూడదనే సంకల్పంతో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు ప్రవేశపెట్టబడ్డాయి. గ్రామ పంచాయతీ తరపున దరఖాస్తు నుండి చెక్కు మంజూరు వరకు పూర్తి సహకారం అందిస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్తీక్ కుమార్, జిపిఓ ఆంజనేయులు, ఉప సర్పంచ్ కొండలు, వార్డు మెంబర్ పురుగుల లాలయ్య, కేశమోని జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోయిన చెంచు యువకుడు పరమేష్



**అమ్రాబాద్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మల్లాపూర్ చెంచుపెంటలో విషాదం చోటుచేసుకుంది. బైక్ విషయంలో తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన మడ్లి పరమేష్ (22) ఆవేశంలో తనపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు.తీవ్ర గాయాలపాలైన పరమేష్‌ను కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చొరవతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరమేష్ మృతి చెందాడు.మృతదేహాన్ని చెంచుపెంటకు తరలించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోయిన పరమేష్ మృతిపై గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# జిల్లా వ్యవసాయ అధికారిగా శ్రీమతి ఎస్. శైలజ బాధ్యతల స్వీకరణ



**రంగారెడ్డి, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిగా (డీఏఓ) శ్రీమతి ఎస్. శైలజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఈ పదవిలో ఉన్న శ్రీమతి డి. ఉష మే 31న పదవీ విరమణ పొందిన నేపథ్యంలో ఆమె స్థానంలో శైలజ నియమితులయ్యారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం శైలజ మాట్లాడుతూ, "రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. జిల్లాలో రైతులకు సకాలంలో సాంకేతిక సూచనలు, నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాను. ఉత్పాదకత పెంపు, సుస్థిర వ్యవసాయ విధానాల ప్రోత్సాహం, పంటల వైవిధ్యీకరణ నా ప్రధాన లక్ష్యాలు" అని తెలిపారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన మాజీ డీఏఓ శ్రీమతి డి. ఉష సేవలను అధికారులు, సిబ్బంది కొనియాడారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శైలజకు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ, జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## ఆల్ ఇండియా మేయర్స్ సమావేశానికి కరీంనగర్ మేయర్ శ్రీనివాస్‌కు ఆహ్వానం



**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో జూన్ 3, 4 తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు అధికారిక ఆహ్వానం అందింది.కౌన్సిల్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ముఖ్య అతిథిగా ఈ సమావేశం జరగనుంది. దేశవ్యాప్తంగా పలువురు మేయర్లు పాల్గొనే ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ప్రజాసేవల మెరుగుదల వంటి అంశాలపై చర్చించనున్నారు.రిషికేష్ మేయర్ రణ్‌జయ్ పాన్వర్, కార్యదర్శి మనోజ్ గుప్తా ఆహ్వానం మేరకు కరీంనగర్ తరపున మేయర్ కొలగాని శ్రీనివాస్ ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో పాల్గొననున్నారు. కరీంనగర్ తరపున ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని నగరపాలక వర్గాలు పేర్కొన్నాయి.

## డిఈఓ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపిన తపస్ రంగారెడ్డి బృందం



**రంగారెడ్డి జిల్లా, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా నూతన విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తపస్ రంగారెడ్డి జిల్లా బృందం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి తపస్ డైరీని అందజేశారు.ఈ సందర్భంగా తపస్ రంగారెడ్డి జిల్లా బాధ్యులు మాట్లాడుతూ, జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి విద్యార్థులను ప్రోత్సహిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేందుకు తోడ్పాటు అందించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షులు కోట్ల కాశి రావు, ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ్, రాష్ట్ర బాధ్యులు సత్తారి రాజిరెడ్డి, యుగంధర్ రెడ్డి, కమిటీ సభ్యులు పున్న రమేశ్, అబ్బాయ, ఆదర్శన్ రావు, ఉపాధ్యక్షులు కాలే శ్రీశైలం, జె. కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి పట్నం కృష్ణ, మండల అధ్యక్షులు వడ్ల రాజేందర్, భాస్కర్ గౌడ్, రత్నా రెడ్డి, మర్యాద రవీందర్, ఇబ్రహీంపట్నం మండల మీడియా కన్వీనర్ పొట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యారంగ అభివృద్ధి కోసం ఉపాధ్యాయ--విద్యార్థుల ప్రోత్సాహానికి కృషి చేస్తామని తపస్ రంగారెడ్డి జిల్లా బృందం పేర్కొంది.

# అంగన్వాడి టీచర్ సేవలు మరువలేనివి

సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్ అభినందన



**ఎలిగేడు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నర్సాపూర్ ఒకటవ అంగన్వాడి కేంద్రంలో 36 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన బండి కళావతి మల్లేశం సేవలు మరువలేనివని సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అంగన్వాడి టీచర్‌గా ప్రజలతో మమేకమై ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి, పిల్లలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందిస్తూ విధుల పట్ల నిబద్ధతతో పనిచేశారు" అని కొనియాడారు. అనంతరం కళావతిని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ, అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



**చారగొండ, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తుర్కలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, "పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు గడువులోగా పూర్తి చేయాలి

-కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



**ఎలిగేడు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాములపల్లె గ్రామంలో నిర్మాణానికి సిద్ధంగా ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం పరిశీలించారు.మండలంలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేసి సమర్పించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. స్కూల్ నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్ యాకన్న, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్



**నాగర్‌కర్నూల్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ముక్తాల శాంతన్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, ఫర్నిచర్ లోపం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, విద్యా సామగ్రి అందేలా చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. "ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆర్‌టీఈ ప్రకారం 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును తప్పనిసరిగా అమలు చేయాలి" అని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, సంయుక్త కార్యదర్శులు శివ, విష్ణు, నాయుడు, జీవన్, చందు తదితర ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లాలపల్లె గ్రామపంచాయతీలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు

-ప్రజల సమస్యల పరిష్కారానికి కొత్త విధానం



**ఎలిగేడు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లాలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి తెలిపారు.ఎంపీడీవో భాస్కరరావుతో కలిసి ఏర్పాటు చేసిన ఈ బాక్స్ ద్వారా గ్రామస్తులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా నమోదు చేసి వేయవచ్చని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు విస్తృత చర్యలు

-తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరిక




**నంద్యాల, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణే ప్రధాన ధ్యేయంగా, మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ తెలిపారు.జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ముఖ్య కూడళ్లలో విద్యార్థులకు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలపై చైతన్యం కల్పించినట్లు ఆయన వివరించారు. 2026 జనవరి నుండి మే 31 వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లలో 312 మైనర్ డ్రైవర్లను గుర్తించి, రూ.15,70,920 జరిమానా విధించామని, వారితో పాటు తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ నిర్వహించామని ఎస్పీ వెల్లడించారు."మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. ఇది వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయకూడదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు.నంద్యాల జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలందరూ, ముఖ్యంగా తల్లిదండ్రులు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు మరింత తీవ్రతరం చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

## వైయస్సార్ విగ్రహ ధ్వంసం వైసిపి కుట్రే

-టీడీపీ నేతల తీవ్ర విమర్శలు



**నందికొట్కూరు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాలలో వైయస్సార్ విగ్రహ ధ్వంసం ఘటనపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో స్పందించారు. జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చెరితరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, "గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన గొడ్డలి పార్టీ నాయకులకే ఇలాంటి చర్యలు సాధ్యం" అని మండిపడ్డారు.వైసిపి కార్యకర్తలే విగ్రహాన్ని ధ్వంసం చేసి, దానిని టీడీపీపై మోపే ప్రయత్నం చేశారని వారు ఆరోపించారు. ఎన్నికల హామీ మేరకు డీఎస్సీ నిర్వహించామని, ఇప్పుడు వైసిపి నేతలు అనవసర హడావిడి చేస్తున్నారని విమర్శించారు. అమరావతి చట్టబద్ధతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, అభివృద్ధిని చూసి ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు జరుగుతున్నాయని ఇద్దరు ఎమ్మెల్యేలు ఆరోపించారు. "మావిగన్ అనగానే శాంతి దూతలమని చెప్పుకుంటారు, కానీ వాస్తవానికి విగ్రహాలను ధ్వంసం చేసే వారే" అని గిత్త జయసూర్య తీవ్రంగా విరుచుకుపడ్డారు.

### ఘనంగా గ్రామపంచాయతీ నూతన భవన ప్రారంభోత్సవం



**అమ్రాబాద్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: అచ్చంపేట మండలం అంకిరోనిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవన ప్రారంభోత్సవం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భూమి పూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, టీపీసీ ఉపాధ్యక్షులు, డీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందజేశారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు పథకం నిజమైన లబ్ధిదారులకు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్య, హాస్టల్ సదుపాయం, ఆరోగ్యకరమైన ఆహారం అందించి వారిని మేధావులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల సంక్షేమం, విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఆర్థిక సవాళ్ల మధ్య పెన్షన్ల పంపిణీ

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య





**నందికొట్కూరు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్ల మధ్య కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేస్తున్నామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు.నందికొట్కూరు మున్సిపాలిటీ 8వ వార్డులో కూటమి నాయకులతో కలిసి పెన్షనర్లతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తోంది" అని అన్నారు.2024 ఎన్నికల సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4,000 పింఛన్ అందజేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని, వికలాంగులకు వివిధ కేటగిరీల్లో రూ.6,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్లు అందజేస్తున్నారని వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## నార్వేలో పర్యటిస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**నందికొట్కూరు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నార్వే దేశంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి మహిళా ప్రతినిధి బృందంలో భాగంగా సోమవారం ఓస్లో నగరానికి చేరుకున్న సందర్భంగా, అక్కడి టిడిపి అభిమానులు, కార్యకర్తలు వారిని ఆత్మీయంగా స్వాగతించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ శబరి మాట్లాడుతూ, "ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా టిడిపి కుటుంబ సభ్యులు కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేకుండా ఒక కుటుంబంలా కలిసే ఉంటారు. అదే టిడిపి ప్రత్యేకత, అదే బలం. ప్రజాసేవే లక్ష్యం, ఐక్యతే శక్తి" అని పేర్కొన్నారు.ఆమె మరింతగా, "ప్రాంతాలు వేరైనా మనసులు ఒక్కటే... దేశాలు వేరైనా టిడిపి కుటుంబం ఒక్కటే" అని భావోద్వేగంగా అన్నారు.

## మారుతున్న మనిషి వైఖరి

-కొక్కొరొకో అని
మేలుకొలిపిన కోడిపుంజు
కిమ్మనకుండా
గమ్మున గంప కిందనే దాగుంది
పరుల మేలుకోరి కూస్తే
నా బతుకు
సమస్యల కొలుపు అవుతుందేమో అని
తలుస్తుంది
-కావ్ కావ్ మని
అరిచే కాకి
అయితె అయితె అని
అరవాలని ప్రయత్నిస్తూ...
కావంటే..
లోకులు పలుకాకులై
కరుస్తారేమోనని
అయోమయంలో పడిపోతుంది
-మ్యావ్ మ్యావ్
అని అరిచే పిల్లి
కుక్కను చూసి
దిక్కు తోచక
బిక్కుబిక్కుమని
పక్క పక్కకు జరిగి
పారిపోతుంది
-బౌ బౌ అని మొరిగే కుక్క
జిత్తుల మారి నక్కను చూసి
మనసులో అక్కసున్నా
చక్కని చుక్క లాగా
నటిస్తుంది
-మారుతున్న కాలంతోపాటు
వాతావరణం
చేసే రణం
పోరాడే గుణం కూడా
మారుతుంది
-గొంతెత్తి ప్రశ్నించే
ఎలుగెత్తి చాటే తంతులో
మన గొంతులోనే
పచ్చి వెలక్కాయ పడుతుంది
వద్దించే వారికి వడ్డిస్తే
ప్రశ్నించేదెవరు
గొంతులన్నీ మూగబోతాయి కదా...
వద్దనుకున్నా
ముద్దనుకున్నా
అణిగిమనిగి ఉండడమే మేలు
పొద్దు పొడుస్తుంది
పొద్దు గుంకుతుంది
నాలుగొద్దులైనంక
అంతా....
సద్దుమణిగిపోతుంది

Ch. **శ్రీనివాస్**
**ఉపాధ్యాయుడు**
ZPHS **కనుకుల**
**స్వగ్రామం:ఎలిగేడు**



## లాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం



ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకట్ రెడ్డి ఎంపీడీవో భాస్కరరావు



పాల్గొన్న ప్రజాప్రతినిధులు

### -పేదల సొంతింటి కల సాకారం

**ఎలిగేడు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లాలపల్లి గ్రామంలో నిర్మించిన 13 ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో భాస్కరరావు, సర్పంచ్ వెంకటరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ, "ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి సొంతింటి కలను నిజం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతోంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు చిగుర్ల క్రాంతి కుమార్, బాసంపల్లి కొండయ్య, వార్డు సభ్యులు ఎండి అఫ్రోజు, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పెద్ది తిరుపతి, ముత్కల అనిల్, మీనుగు మల్లేశం, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతోనే అద్భుత విజయాలు సాధ్యం -- ఐఏఎస్ నరహరి



**పెద్దపల్లి, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిరంతర కృషి, క్రమశిక్షణ, లక్ష్యసాధన పట్ల అంకితభావం ఉంటే జీవితంలో ఏ రంగంలోనైనా అత్యున్నత విజయాలు సాధించవచ్చు అని ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అన్నారు. హైదరాబాద్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమై ఆయన విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, ఉన్నత విద్యా అవకాశాలు, పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. ప్రతి విద్యార్థితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి ఆసక్తులకు అనుగుణంగా కోర్సులు, కెరీర్ మార్గాలను సూచించారు.తల్లిదండ్రులు పిల్లలపై మార్కుల ఒత్తిడి లేకుండా సహజ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల కెరీర్ సందేహాల నివృత్తి, ఉన్నత విద్యా ప్రణాళికలు, సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలపై మార్గదర్శకత్వం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ 7095915728 ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థులు ఎదుర్కొంటున్న అవకాశాల కొరత, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నరహరి హామీ ఇచ్చారు. యువత విజయమే భావి సమాజ అభివృద్ధికి పునాది అవుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యమా..
# అధికారుల నిర్లక్ష్యమా..!

**-ఉపాధి పనుల కోసం రైతు కార్మికుల ఆవేదన**




**నందికొట్కూరు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామ సచివాలయం ఎదుట సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పనులు కల్పించాలని ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకుడు ఎం. కర్ణ మాట్లాడుతూ, "వర్షాలు లేక కష్టజీవులు కనీసం ఉపాధి పనులకు పోదామంటే పనులు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమా లేక అధికారుల నిర్లక్ష్యమా?" అని ప్రశ్నించారు. మండలంలోని పారుమంచాల, బన్నూరు, తంగడంచ, మల్లెం గ్రామాల్లో ఉపాధి పనులు పెట్టలేదని, వెంటనే పని అడిగిన వారందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 125 రోజులు ఉపాధి శ్రామికులకు పని కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ, తగిన నిధులు కేటాయించడం లేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని, అందుకే కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కలసి 200 రోజుల పని దినాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ వేతనం రూ.700 ఇవ్వాలని కోరారు. అలాగే 30 రోజులు పని చేసిన ఉపాధి శ్రామికులందరికీ పనిముట్లు ఇవ్వాలని, పనుల దగ్గర వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, రెండు ఫోటోల విధానాన్ని రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామ సెక్రటరీ శాలు భాష సమస్యలను మండల ఉపాధి అధికారులతో చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి శ్రామికులు సూరి శ్రీను, నాగరాజు, సాహా దేవుడు, రాజు, పెద్ద శివన్న, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేలా పాలన

**– ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**అమనగల్లు, జూన్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గడిచిన రెండేళ్లలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని కాపాడేలా పాలన సాగిస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీలో ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళను టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి లతో ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు.. గత ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం కోసం పనిచేయకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. విడతల వారీగా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా రూ.5 లక్షలు పూర్తి స్థాయిలో బిల్లులు సకాలంలో చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, కౌన్సిలర్ సునీత ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, సర్పంచ్ మండ్లి రాములు, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, డైరెక్టర్లు తాళ్ళ రవీందర్, సంపత్ కుమార్, ఆదివాసి రాష్ట్ర నాయకులు అవ్వారి శివలింగం, కృష్ణ నాయక్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, తోట శ్రీను, రహీం, విజయ్ నాయక్, దేవరశెట్టి మహేష్, సలీం, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న కూరగాయాలు





**- దంచి కొడుతున్న ఎండలే కారణం**

**- ధరలు నియంత్రించాలంటున్న ప్రజలు**

**ఆమనగల్లు, జూన్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఒకవైపు ఎండలు దంచికొడుతుండగా.. వాటిధాటికి కూరగాయల దిగుబడి పడిపోయి ధరలు దడపుట్టిస్తున్నాయి. వివరిస్తున్నారు. కేవలం వారం వ్యవధిలోనే ధరలు భారీగా పెరగడంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పదిరోజుల క్రితం రూ.200 తీసుకెళ్తే సంచినిండా వచ్చిన కూరగాయలు ఇప్పుడు రూ.500 వెచ్చించినా రావడం లేదని వాపోతున్నారు. కొత్తిమీర కిలో మొన్నటివరకు రూ.40 పలికిందని, ఇప్పుడు రూ.200కు చేరడంతో చిన్నకట్ట రూ.20కి తగ్గకుండా విక్రయించాల్సి వస్తోందని వ్యాపారులు అంటున్నారు. మరోవైపు.. కాకరను ఒంటిమామిడి, టమాటను హైద్రాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, క్యాప్సికం, బీన్స్ ను బెంగళూరు నుంచి, బోయినప ల్లి నుంచి కాలీఫ్లవర్, క్యాబేజీ, బీట్రూట్, కీరా దిగుమతవుతోందని, క్యారెట్ చామగడ్డ సికింద్రాబాద్ నుంచి తీసుకొస్తున్నామని, తద్వారా ధరలు పెంచక తప్పడం లేదంటున్నారు.

**ప్రస్తుతం కూరగాయల ధరలు (కిలో రూ.లలో)**

| | |
|---|---|
| టమాట | 40 |
| పచ్చిమిర్చి | 60 |
| వంకాయ | 40 |
| బెండకాయ | 60 |
| కాకరకాయ | 60 |
| బీరకాయ | 80 |
| సొరకాయ | 60 |
| క్యాబేజీ | 70 |
| మునగకాయ | 80 |
| దోసకాయ | 40 |
| చిక్కుడుకాయ | 80 |

# బొడ్డు శంకర్ వికలాంగుల సమాజానికే గర్వకారణం

**- వికలాంగుల సంఘం నాయకులు**

**- శంకర్ ను సన్మానించిన వికలాంగుల సంఘం నాయకులు**



**ఆమనగల్లు, జూన్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బొడ్డు శంకర్ ఒక వికలాంగుడు తన శారీరక పరిమితులను అధిగమించి డాక్టరేట్ సాధించడం సరిహద్దులను చెరిపేసే గొప్ప విజయమని, ఇది అతనికి, అతని కుటుంబానికి మాత్రమే కాక, సమాజానికి మొత్తం గర్వకారణమని ఇది అపారమైన పట్టుదలకి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని ఆమనగల్లు వికలాంగుల సంఘం నాయకులు తెలిపారు. యునైటెడ్ అమెరికన్ యూనివార్సిటీ వారి నుండి డాక్టర్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ లో గౌరవ డాక్టరేట్ పురస్కారం పొందిన జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు బొడ్డు శంకర్ ను సోమవారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆమనగల్లు వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో బొడ్డు శంకర్ ను పూలమాల శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బొడ్డు శంకర్ చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చి గౌరవించడం వికలాంగుల సమాజానికే గర్వకారణం అని అన్నారు. ఇదే స్ఫూర్తితో వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కొరకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆవుల వెంకటేష్, కొత్త మల్లిఖార్జున్, సుక్క వెంకటయ్య, సత్యనారాయణ గౌడ్, కృష్ణ, చెన్నకేశవులు, కొండల్ గౌడ్, ఆనంద్, రజియా, అలివేలు, అమృత, కళమ్మ ఆల్వాల్, గణేష్, వెంకటయ్య మరియు నాలుగు మండలాల వికలాంగులు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్‌పై
# చర్యలు తప్పనిసరి

**-పిడిఎస్‌యూ నేతల ఆవేదన**



**నందికొట్కూరు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నారాయణ స్కూల్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె. ఆది మాట్లాడుతూ, "విద్యార్థులకు సెలవులు ఇచ్చినా టీచర్లకు సెలవులు ఇవ్వకుండా, అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ టీచర్లను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారు. టీచర్లకు అడ్మిషన్ టార్గెట్ విధించి, 'కచ్చితంగా అడ్మిషన్లు చేయాలి' అని హుకుం జారీ చేస్తున్నారు. ఇది వారి మనోభావాలను దెబ్బతీస్తోంది" అని విమర్శించారు. అదేవిధంగా, అడ్మిషన్ చేసిన విద్యార్థుల తల్లిదండ్రులపై పాఠశాల ప్రారంభం కాకముందే పుస్తకాలు, యూనిఫామ్ ఫీజుల పేరుతో భారం మోపుతున్నారని ఆయన ఆరోపించారు. "వెంటనే ఆ విద్యాసంస్థపై చర్యలు తీసుకొని, విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రైవేట్ టీచర్లకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో స్కూల్ ముందు ధర్నా చేపడతాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ డివిజన్ సహాయకార్యదర్శి శ్యాం నాయక్, ఉపాధ్యక్షుడు అజయ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రవేశాలు



**కనగల్ ,జూన్ 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కనకల్ మండలం దొర పల్లి గ్రామంలో సోమవారం రోజు ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ తెలిపారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదల సొంతింటి కలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చినట్లు తెలిపారు ఇందిరమ్మ ఇళ్లలో కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో అనుమతి పొందిన పలు గృహాలకు గృహప్రవేశాలు నిర్వహించారు గృహాలను నిర్మించుకునేందుకు ఐదు లక్షల ఆర్థిక సహాయం చేసి సొంత ఇంటి కలలు నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారగాని నిర్మల నరేష్ , గ్రామ కార్యదర్శి గణేష్, వార్డు సభ్యులు దాసరి లక్ష్మి, దాసరి పరమేశ, దాసరి అంజమ్మ, ఏమి రెడ్డి రవీందర్ రెడ్డి ,గాజుల మారయ్య ,సుంకి రెడ్డి వెంకట్ రెడ్డి , బక్క రాజశేఖర్,మారగాని సైదులు, చినపాక జలంధర్, బైరగగాని శేఖర్ ,అయితగాని శంకరయ్య, రెడ్డి వెంకటరెడ్డి, కొండ రామచంద్రు,ఎండి ఆసిఫ్ ,దాసరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ



**ఆమనగల్లు, జూన్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు క్రమశిక్షణ, పాఠశాల వాతావరణంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కౌన్సిలర్ కొవ్వూరు అనిత శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు విఠాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్ పాల్గొన్ని చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్‌వాడీ టీచరే తల్లి వంటి వారన్నారు. వారిని ప్రేమగా చూసుకుంటూ ప్రాథమిక విద్యను అందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలని, చిన్నతనం నుంచే బడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలనే సదుద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్‌వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ యాచారం సువర్ణ, నాయకులు శ్రీధర్ నాయక్, పర్వతాలు, రవి, బన్నె శేఖర్, బాల్య మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థి ఉద్యమ నాయకుడు పెరుమాళ్ల సురేష్ సందేశం



**హైదరాబాద్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థి ఉద్యమ నాయకుడు పెరుమాళ్ల సురేష్ బ, ా ఎో దో్వ గ ం గా స్పందించారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఎన్నో ఏళ్ల పోరాటం, అనేక ఆత్మబలిదానాలు కారణమని ఆయన గుర్తుచేశారు. విద్యార్థి దశలో తాను జెండా పట్టుకుని "జై తెలంగాణ" అంటూ ధర్నాలు, రాస్తారోకాలు, నిరాహార దీక్షలు, మానవహారం వంట మార్పులు నిర్వహించానని, తెలంగాణ జేఏసీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి, నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వద్ద నిరసనలు తెలుపుతూ రైళ్లను దిగ్బంధించిన రోజులు గుర్తొస్తున్నాయని పేర్కొన్నారు. "తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు జోహార్లు. వారి ఆశయాలు నెరవేరాలని మనమంతా కృషి చేయాలి. ప్రాంతాలు వేరైనా మనసులు ఒక్కటే, దేశాలు వేరైనా తెలంగాణ ఆత్మ ఒక్కటే" అని ఆయన అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం లో పాల్గొన్న కలెక్టర్



బి. చంద్రశేఖర్.

**దేవరకొండ జూన్ 01.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**

దేవరకొండ మండలం, శక్రు తండా గ్రామ పంచాయతీలో" తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ మరియు అధికారులతో కలిసి గృహప్రవేశం చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసింది.. రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడుస్తున్న ఈ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తుంది. దేవరకొండ నియోజకవర్గంలోని ఇండ్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వారి యొక్క ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని దేవరకొండ ఎమ్మెల్యేబాలు నాయక్ తెలిపారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి. చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## ముస్లింలపై వివక్షతో షాదీఖానాకు గ్రహణం

-భవనం ప్రారంభం ఆలస్యం పై సిపిఐ ఆవేదన



**నందికొట్కూరు, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు పట్టణంలోని కేజీ రహదారిపై నిర్మించిన షాదీఖానా భవనం పూర్తి అయినప్పటికీ ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం ముస్లింలపై వివక్షతకు నిదర్శనమని సిపిఐ జిల్లా కార్యదర్శి రఘురామమూర్తి తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులుతో కలిసి భవనాన్ని పరిశీలించిన ఆయన, "ప్రజా అవసరాల కోసం నిర్మించిన భవనం ఆధిపత్య పోరాటాల కారణంగా నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి శంకుస్థాపన చేసిన ఈ భవనం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణం పూర్తయినా ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం విచారకరం" అని అన్నారు. భవనం ప్రారంభం ఆలస్యం కావడం వల్ల ప్రజలకు ఉపయోగపడాల్సిన వసతి నిరుపయోగంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి షాదీఖానా భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శేషన్న, నవీన్, ఏఐటీయూసీ నాయకులు అహమ్మద్, ఫిరోజ్, షేక్ షాహిద్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలితాలు





**మేషరాశి**

ఇంటా బయట పని ఒత్తిడులు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు తగ్గుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమానంతరం పనులు పూర్తి అవుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. జీవిత భాగస్వామితో వివాదాలు కలుగుతాయి. దత్తాత్రేయుని నామస్మరణ శుభకరం.

**వృషభరాశి**

చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారానికి పెట్టుబడులు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. శివారాధన శుభకరం.

**మిధునరాశి**

సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి, వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది. శ్రీరామ నామస్మరణ శుభకరం.

**కర్కాటకరాశి**

పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఇంటాబయటా గందరగోళ పరిస్థితులుంటాయి. మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. నవగ్రహ నామస్మరణ శుభకరం.

**సింహరాశి**

ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. ధన పరంగా ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. శ్రీరామ నామస్మరణ శుభకరం.

**కన్యరాశి**

దూరపు బంధువులు కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. నవగ్రహ స్తోత్రం శుభకరం.

**తులరాశి**

ఆర్థిక అనుకూలత పెరుగుతుంది. గృహమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కొత్త వ్యక్తులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. విష్ణు నామస్మరణ శుభకరం

**వృశ్చికరాశి**

వృథా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ విషయంలో కొంత ఒత్తిడి తప్పదు. శ్రీ గణపతి నామస్మరణ శుభకరం.

**ధనస్సు రాశి**

కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తికావు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. శ్రీ ఆంజనేయస్వామి నామస్మరణ శుభకరం.

**మకరరాశి**

చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి వివాదానికి సంబంధించి విలువైన సమాచారం అందుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు అనుకూలిస్తాయి. గురునామస్మరణ శుభకరం.

**కుంభరాశి**


ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. కీలక వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన మానసిక బాధను కలిగిస్తుంది. శ్రీ కుమారస్వామి నామస్మరణ శుభకరం

**మీనరాశి**

కొన్ని వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. దైవ సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా పురోగతి కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. శ్రీ వెంకటేశ్వర స్మరణ శుభకరం.

**(రాశి ఫలాలు నిపుణుల సలహాలతో పరిగణంలోకి తీసుకోండి )**

శ్రీ కాలభైరవ ఉపవాసకులు
దక్క జంబులయ్య (స్వామి )
9491163914



# ఉపాధి హామీ చట్టంలో ఫోటో విధానాన్ని రద్దు చేయాలి






**ఆమనగల్లు, జూన్ 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉపాధి హామీ చట్టంలో రెండుపూటల ఫోటో అప్లోడ్ విధానాన్ని రద్దు చేయాలిని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్, అధ్యక్షులు పెరుమాండ్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం రక్షణకై ఉపాధి కూలీల అవగాహన సదస్సును లాలూ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి జగన్, అంజయ్య హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి రెండవసారి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి చివరికి చట్టాన్ని రద్దు చేసే కుట్రలో భాగంగా ఉపాధి హామీ కూలీల పొట్టగొట్టే విధానంలో రెండుసార్లు ఫోటో దింపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. రెండు పూటల ఫోటో తీసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, మాత్మ గాంధీ పేరుతో ఉన్న ఉపాధ్యాయుని చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, జి రాంజీ పేరును తొలగించాలని, ఉపాధి హామీ కూలీలకు పరమాంధభ భీమ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, వేసవిలో పనిచేస్తున్న కూలీలకు పని వద్ద మంచినీళ్లు నీడ సౌకర్యం కల్పించి కూలీలకు వడదెబ్బ కాపాడుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా కూలీలకు రోజువారి వేతనము 800 చెల్లిస్తూ సంవత్సరానికి కనీసం 200 రోజుల పని దినాలను కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26 వేల జీతం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాలలో సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వము ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి తొలగించాలని ప్రయత్నాలు కొనసాగిస్తే ఉపాధి హామీ కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని 12మందితో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కొప్పు రమేష్, కార్యదర్శిగా లాలు నాయక్, కమిటీ సభ్యులుగా రవీందర్, పర్వతాలు, విక్రమ్, వెంకటయ్య, నిర్మల, చందు, యాదయ్య, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమం నుంచి అభివృద్ధి వరకు -- తెలంగాణ ప్రస్థానం




తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అనేది కేవలం ఒక రాష్ట్రం ఏర్పడిన రోజును గుర్తు చేసుకునే సందర్భం మాత్రమే కాదు. ఇది ఆత్మగౌరవం కోసం సాగిన ఉద్యమానికి, వేలాది మంది త్యాగాలకు, కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతీక. జూన్ 2 తెలంగాణ చరిత్రలో ఒక మలుపు. ఈ రోజు తెలంగాణ ప్రజల కలలు సాకారమైన రోజు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, రైతులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజాసంఘాలు కలిసి చేసిన పోరాటం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విశిష్ట అధ్యాయం. ఆ ఉద్యమం కేవలం భౌగోళిక విభజన కోసం జరగలేదు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, స్వయం పాలన, ప్రాంతీయ అభివృద్ధి వంటి లక్ష్యాలతో ముందుకు సాగింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ అనేక రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేసింది. సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలులో గణనీయమైన పురోగతి కనిపించింది. హైదరాబాద్ ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తూ దేశ ఆర్థిక వృద్ధికి ఒక ప్రధాన కేంద్రంగా ఎదిగింది. అయితే అభివృద్ధి అనేది కేవలం గణాంకాల్లో కనిపించే సంఖ్యలు మాత్రమే కాదు. ప్రతి పల్లె అభివృద్ధి చెందాలి. ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు లభించాలి. రైతు ఆర్థికంగా బలపడాలి. ప్రభుత్వ విద్య, వైద్యం మరింత బలోపేతం కావాలి. వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు అందాలి. అప్పుడే తెలంగాణ ఉద్యమం ఆశించిన ఫలితాలు పూర్తిగా సాకారమైనట్లవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే పాలనకు దిక్సూచి కావాలి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌర సమాజం అందరూ కలిసి పనిచేసినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. తెలంగాణ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. వారి ప్రతిభ, ఆలోచనలు, శ్రమ రాష్ట్ర పురోగతికి బలమైన పునాదులు కావాలి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు మనమంతా కట్టుబడి ఉండాలి. ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేయాలి. అదే అమరవీరులకు నిజమైన నివాళి. అదే బంగారు తెలంగాణ నిర్మాణానికి మార్గం.

**– గంగవరం రామకృష్ణారెడ్డి**
**జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (TWJF), వనపర్తి జిల్లా**



## అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**సిద్దిపేట, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్‌లో మాట్లాడుతూ ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం టీచర్లకు రూ.18 వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, పదవీవిరమణ ప్రయోజనాలను పెంచి పింఛను, వీఆర్ఎస్ సౌకర్యం ఇవ్వాలని కోరారు. అలాగే ఐసీడీఎస్‌లో ఉన్న అనేక యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి నెలా ఐదవ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కూడా ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా వేసవి సెలవులు ఇవ్వాలని ఆయన సూచించారు. గతంలో మంత్రి సీతక్క ఇచ్చిన హామీలను అమలు చేయాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎస్. రమేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పిడిశెట్టి రాజు స్పష్టం చేశారు.

## జూన్ 2 తెలంగాణ ప్రజల చరిత్రలో ఒక విశిష్టమైన రోజు - మహ్మద్ ఆజ్జు




**గంగాధర, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూన్ 2 తెలంగాణ ప్రజల చరిత్రలో ఒక విశిష్టమైన రోజు అని మహ్మద్ ఆజ్జు పేర్కొన్నారు. దశాబ్దాల పోరాటం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం చెందిందని, ఇది ఉద్యమకారుల త్యాగానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వం ప్రజల స్వప్నాన్ని సాకారం చేసిందని, ఆయన ఒక నాయకుడే కాకుండా ఉద్యమానికి ప్రతిరూపమని ఆజ్జు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో మిషన్ భగీరథ, రైతు బంధు, రైతు భీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, టీఎస్-ఐపాస్, ఫార్మా సిటీ, ఐటీ అభివృద్ధి వంటి పథకాల ద్వారా తెలంగాణ అభివృద్ధి దిశగా దూసుకెళ్లిందని తెలిపారు. జూన్ 2 కేవలం ఆవిర్భావ దినోత్సవం మాత్రమే కాకుండా ప్రజల ఆశల పండుగ అని, తెలంగాణ భవిష్యత్తు వెలుగులు నింపే లక్ష్యం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని ఆయన అన్నారు. కేసీఆర్ నాయకత్వం తెలంగాణ ప్రజల గర్వకారణమని ఆజ్జు పేర్కొన్నారు.

## 1వ & 19వ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ మేయర్ కొలగాని శ్రీనివాస్ పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. 1వ డివిజన్ ఆరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 19వ డివిజన్ రేకుర్తిలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుధ్య సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. నగర అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు భారీ అపర్ణ జితేందర్, సుధాగోని మాధవి, కృష్ణా కుమార్ గౌడ్, అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది.

## అనుమతి లేని అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణంలో మున్సిపల్ అనుమతి లేకుండా అనేక భవనాలు, హాస్పిటల్ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కోర్టు పక్కన ఉన్న చందా న్యూరో ఁ ట్రామాకేర్ హాస్పిటల్ 45 ఏళ్ల పాత భవనాన్ని రీ--మోడలింగ్ చేసి అద్దాల మేడగా మార్చడం ప్రమాదకరమని, పార్కింగ్ స్థలాన్ని ల్యాబ్, స్కానింగ్ రూమ్‌లుగా మార్చి రోగులకు చికిత్స అందించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన ఆరోపించారు. గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, వెంటనే విచారణ జరిపి హాస్పిటల్‌ను కూల్చివేసి యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.

## మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిరసన





**గంగాధర, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం హైదరాబాదులో సీఎం క్యాంప్‌ఆఫీస్ ముట్టడి, నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా ముందస్తు అరెస్ట్ చేసినట్లు సమాచారం. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజును పోలీసులు గంగాధర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు, సంఘ భవనాలు నిర్మించినప్పటికీ సిడిఎఫ్, డీఎంఎఫ్‌టి బిల్లులు, కేంద్ర--రాష్ట్ర నిధులు విడుదల కాకపోవడంతో మాజీ సర్పంచులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని శ్రీమల్ల మేఘరాజు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘం కోరుతోంది.

## కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని మున్సిపల్ కమిషనర్కు వినతి



**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కొత్తపల్లి మున్సిపాలిటీ, కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత హరితహారంలో పనిచేసే కూలీలు ఉపాధి కోల్పోయారు. ఈ సమస్యను స్థానిక 17, 18వ డివిజన్ల కార్పొరేటర్లు వేముల కవిత చంద్రశేఖర్, వాసాల రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్లు, కూలీలతో కలిసి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కోల్పోయిన కూలీలకు ప్రత్యామ్నాయంగా పని కల్పించి ఆదుకోవాలని కమిషనర్‌ను కోరారు. కూలీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు.

## పాలకుర్తిలో బాధ్యతలు స్వీకరించిన నూతన వ్యవసాయ అధికారులు



**పాలకుర్తి, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలానికి బదిలీపై వచ్చిన ఇద్దరు కొత్త వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఏఈఓగా పనిచేసిన బి. శశిధర్ ముత్తారం మండలానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో మానేల సువర్ణరేఖ కొత్త ఏఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఎల్కలపల్లి రైతు వేదిక క్లస్టర్‌కు బాధ్యతలు చేపట్టారు. అలాగే కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన యం. యోజన స్థానంలో రెగ్యులర్ ఏఈఓగా కుమ్మం శ్రీకాంత్ నియమితులయ్యారు. ఆయన జయ్యారం రైతు వేదిక క్లస్టర్‌కు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్ కొత్త అధికారులను పుష్పగుచ్ఛాలతో స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏఈఓల రాకతో రైతు వేదికల్లో సేవలు మరింత బలోపేతం కానున్నాయి.

## వడ్ల కొనుగోళ్ల ఆలస్యంపై రైతుల ఆగ్రహం



**గన్నేరువరం, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హనుమాజిపల్లి గ్రామ రైతులు స్థానిక డిసిఎంఎస్ కేంద్రంలో వడ్ల కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నందుకు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జంగపెల్లి ఐకెపి కేంద్రంలో అన్ని వసతులు ఉన్నప్పటికీ సిబ్బంది కమిషన్ల కోసం వడ్లు కొనుగోలు చేయవద్దని చెబుతున్నారని రైతులు ఆరోపించారు. ఈ నెల 20న తూకం వేయాల్సిన వడ్లు ఇప్పటివరకు తూకం వేయకపోవడంతో వర్షం పడితే పంట నష్టపోతుందని వారు వాపోయారు. తమ పంటలకు నష్టం వాటిల్లకముందే వడ్ల కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోళ్లలో జాప్యం రైతులలో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది.

## డి--8 కాలువ పూడిక తీత పనులు ప్రారంభం



**గన్నేరువరం, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మైలారం గ్రామంలోని డి--8 ఉపకాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, పూడిక మట్టిని తొలగించి సాగునీటి సౌకర్యం మెరుగుపరిచేందుకు పనులు ప్రారంభమయ్యాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సోమవారం ఈ పనులను సర్పంచ్ గాలిపెల్లి పోచవ్వ స్వయంగా ప్రారంభించారు. కూలీలు కొలతల ప్రకారం పనిచేసి అధిక వేతనం పొందాలని సూచించారు. పనులు జరుగుతున్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూడా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు తిరుపతి, రేణుక, రవి, కవిత, లక్ష్మి, రజితతో పాటు ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాలువ పనులు ప్రారంభం కావడంతో రైతుల కళ్లలో ఆనందం మెరిసింది.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ - ప్రజాస్వామ్య చరిత్రలో విశిష్ట ఘట్టం

జూన్ 2, 2014న తెలంగాణ దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది. ఇది కేవలం రాష్ట్ర విభజన కాదు, దశాబ్దాల కల, వేలాది మంది పోరాటం, వందలాది అమరవీరుల త్యాగాల ఫలితం. ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం, ప్రతి విద్యార్థి గుండెల్లో ప్రత్యేక తెలంగాణ ఆశయం నాటుకుపోయింది. 1969లో ప్రారంభమైన ఉద్యమం నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగి, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మేధావులు అందరూ భాగస్వాములయ్యారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం, పార్లమెంట్ ఆమోదం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మార్గం సుగమమైంది. రాష్ట్ర అవతరణ తర్వాత తొలి పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించింది. కాళేశ్వరం ప్రాజెక్టు, రైతు బంధు, రైతు బీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీఎస్-ఐపాస్ వంటి పథకాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మహిళా సాధికారత, పెట్టుబడుల ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ విస్తరణ, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో పాటు తెలంగాణ రైజింగ్ 2047 ద్వారా రాష్ట్రాన్ని




పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రగతికి విద్య, ఉపాధి, పరిశ్రమలు, వ్యవసాయం, ఆరోగ్యం, పారదర్శక పాలన రంగాల్లో సమతుల్య పురోగతి అవసరం. ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాలకు నిధుల సమీకరణ, పెట్టుబడుల కార్యరూపం, ఉపాధి కల్పన వంటి అంశాలు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన సవాళ్లుగా మారాయి. అప్పుల భారం, రెవెన్యూ లోటు, పెరుగుతున్న సంక్షేమ వ్యయాలు ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతున్నాయి. అమరవీరుల ఆశయాలకు నిజమైన నివాళి సమగ్ర అభివృద్ధి ద్వారానే సాధ్యం. ఉద్యమంతో సాధించిన తెలంగాణ అభివృద్ధితో ఆదర్శ రాష్ట్రంగా ఎదగాలి.

**జై తెలంగాణ -- జై భారత్**

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్**
**ఎం.ఎస్సి., ఎం.ఏ., ఎం.ఎడ్.**
**అధ్యాపకులు**
**9912775834**



## బీసీ గురుకుల బోధనేతర సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్




**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్న వాచ్‌మెన్, స్వీపర్, స్కావెంజర్ వంటి బోధనేతర సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ తెలంగాణ ఎంజెపి నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. శివశంకర్ మాట్లాడుతూ, తక్కువ వేతనాలతో, ఎలాంటి లీవులు లేకుండా ప్రతిరోజూ 12 గంటలకు పైగా విధులు నిర్వహిస్తున్నామని, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచుతామని ప్రకటించినప్పటికీ, బీసీ గురుకుల సొసైటీ కొత్త నియామకాల కోసం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల 300 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని, టెండర్‌ను రద్దు చేసి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో నవీన్, రాజు, లావణ్య, స్వప్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3న సైకిల్ ర్యాలీకి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు




**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా జూన్ 3న కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, ఏ.జె. పెడల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ రోజు నగరంలో పోస్టర్ విడుదల చేసిన చైర్మన్ వి. నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి ఎలగందల వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ర్యాలీ పూర్తి చేసిన సైక్లిస్టులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని చెప్పారు. అన్ని వయస్సుల వారు తమ సైకిల్‌లతో పాల్గొనవచ్చని, సైక్లింగ్ వ్యక్తిగత ఆరోగ్యానికి తోడ్పడటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. చమురు కొరత, ధరల పెరుగుదల వంటి సమస్యలకు పరిష్కారంగా సైక్లింగ్‌ను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, కోశాధికారి వడకాపురం జగదీశ్వరాచారి, సభ్యులు అఖిల్ రెడ్డి, డా. వడ్లూరి శ్రీనివాస్, ఎం. మహేందర్ తదితరులు పాల్గొన్నారు. జూన్ 3న సైకిల్ ర్యాలీకి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



**హుస్నాబాద్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గతంలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసాయని, ముందుగా బహిరంగ క్షమాపణలు చెప్పిన తర్వాతే నవ నిర్మాణ సభ నిర్వహించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తిననని, తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రజలు మరచిపోలేదని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలను గౌరవించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, ముందుగా అక్కడి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. బీజేపీ ప్రేరణతో తెలంగాణలో విద్వేష రాజకీయాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా సభలు నిర్వహిస్తే సహించరని హెచ్చరించారు. హీరోగా అభిమానించవచ్చని, కానీ తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని మంత్రి స్పష్టం చేశారు. నవ నిర్మాణ సభ పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించవద్దని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు.

## భూమి సారాన్ని కాపాడుకుందాం - రైతులకు అధికారుల పిలుపు



**హుస్నాబాద్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండలం చౌటపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేతి బచావో అభియాన్ అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, విస్తరణ అధికారులు ఐశ్వర్య, శేఖర్ రైతులకు పలు సూచనలు చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోవడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని వివరించారు. అందువల్ల అవశేషాలను పొలంలో కలిపి సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని సూచించారు. యూరియా ఎరువును అవసరానికి మించి వాడకూడదని, నేల పరీక్షల ఆధారంగా మాత్రమే వినియోగించాలని హెచ్చరించారు. సాగు ఖర్చులు తగ్గించేందుకు సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులను ఎక్కువగా ఉపయోగించాలని, జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. సన్న వరి వంగడాల సాగు మార్కెట్లో మంచి ధరలు తెస్తుందని, ప్రకృతి అనుకూల వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడి స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుందని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ శాస్త్రీయ, ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని అధికారులు రైతులకు పిలుపునిచ్చారు.

## నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు - వలస సుభాష్ చంద్రబోస్



**హుస్నాబాద్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులని, తల్లిదండ్రుల కలలు నిజం చేసేందుకు విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కృషి చేయాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామ శంకర్‌నగర్‌లో ఇటుక బట్టీల వద్ద సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్యతో కలిసి ఒడిశా కార్మికుల పిల్లలతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి బాలబాలిక విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపాలని సూచించారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని, సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. వలస కార్మికుల పిల్లలకు పౌష్టికాహారం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ను కోరారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం ప్రజా వేదిక రెండు దశాబ్దాలుగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెరిక బుచ్చయ్య, ఎస్-ఎస్‌బీ బ్రిక్స్ యజమాని గాజే సత్తయ్య, శ్రీనివాస్, అజయ్, ఒడిశా కార్మికులు, చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం విద్య, క్రమశిక్షణ, విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ డిమాండ్



**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన వేతనాల్లో శాస్త్రీయ భద్రత లేదని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని ఆయన కోరారు. 14 ఏళ్ల తర్వాత కనీస వేతనాలు సవరించడం ఆహ్వానించదగ్గ విషయమే అయినా, ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు సరిపోలేవని విమర్శించారు. అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.16 వేల నుంచి హైస్కిల్డ్ వర్కర్లకు రూ.20 వేల వరకు వేతనాలు ప్రకటించినప్పటికీ, ఇప్పటికే ఉన్న జీతాలతో పోలిస్తే పెద్ద తేడా లేదని తెలిపారు. జీవోల్లో ఉన్న సిఫారసులను పరిగణనలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉపసంఘం పేరిట వేతనాలు ప్రకటించడం తగదని అన్నారు. కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని, పెరిగిన ధరలు, కనీస వేతనాల చట్టం, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వేతనాలను సవరించాలని ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించకపోతే కార్మిక సంఘాలు ఆందోళన చేపడతాయని హెచ్చరించారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం - కలెక్టర్ కే. హైమావతి




**సిద్దిపేట, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 12 వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కే. హైమావతి, అటవీశాఖ అధికారి పద్మజారాణి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అటవీశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్ఓ నాగరాజమ్మ, అటవీశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ పిలుపునిచ్చారు.

### ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కారించాలి -- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 188 దరఖాస్తులు అందగా, కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త, ఎన్‌హెచ్ఆర్సీ, కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అదనంగా, రెడ్ క్రాస్ సేవలను విస్తరించేందుకు ఉద్యోగులు సభ్యత్వం పొందాలని, విపత్తుల సమయంలో బాధితులకు సహాయం అందించేందుకు సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# భర్తపై యాసిడ్ దాడి.. కంటి చూపు కోల్పోయిన భర్త..

**- భార్యకు కోర్టు ఏ శిక్ష విధించిందంటే**



**న్యూఢిల్లీ జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భర్తపై యాసిడ్ దాడి చేసిన భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది కోర్టు. అంతేకాదు.. ఆమెకు రూ.1.75 లక్షల జరిమానా కూడా విధించింది. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని శంభల్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కఖాన్నా అనే మహిళకు, ముజఫ్ఫర్ అనే వ్యక్తికి కొన్నేళ్లక్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అయితే, భార్యాభర్తల మధ్య తరచూ విబేధాలు, వాగ్వాదం చోటు చేసుకునేవి.ఇదే సమయంలో కఖాన్నాకు వేరొకరితో వివాహేతర సంబంధం కూడా ఉంది. దీంతో ఆమె భర్త నుంచి విడాకులు ఇవ్వాలని కూడా కోరుకుంది. అయితే, భర్తతో గొడవలు, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో గత ఏడాది మార్చి 7న అతడిని హత్య చేయాలనుకుంది. ఇందుకోసం ఇంట్లో నిద్రిస్తున్న భర్త ముజఫ్ఫర్‌పై యాసిడ్ పోసింది. ఈ దాడితో మేల్కొన్న ముజఫ్ఫర్ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయినా అతడి భార్య కఖాన్నా వదలకుండా మళ్లీ యాసిడ్ పోసింది. అది మీద పడటంతో ముజఫ్ఫర్ కంటి చూపు కోల్పోయాడు. అప్పుడు అక్కడి నుంచి తప్పించుకున్న భర్త.. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి కారణమైన భార్య కఖాన్నాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుపై శంభల్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ విచారణ జరిపింది. కఖాన్నా నేరం చేసినట్లు రుజువైంది. దీంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టు సోమవారం తుది తీర్పు వెల్లడించింది. జస్టిస్ గోపాల్ ఈ తీర్పు వెల్లడించారు. దీని ప్రకారం కఖాన్నాకు జీవిత ఖైదు విధించారు. అంతేకాదు.. రూ.1.75 లక్షల జరిమానా కూడా చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

# మీరు హాయిగా కూర్చుని విశ్రాంతి తీసుకోండి..



**న్యూఢిల్లీ జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పశ్చిమాసియాలో మారుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో ఇరాన్ నిజంగా ఒప్పందం చేసుకోవాలనుకుంటోంది అని సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవడం వల్ల.. వాషింగ్టన్‌తోపాటు దాని మిత్ర దేశాలకు కూడా మంచి జరుగుతుందని ఆయన అన్నారు. ఆయన చేసే నిర్ణయాలకు తన సొంత పార్టీలో వారు గానీ, రాజకీయ ప్రత్యర్థులు (డెమోక్రాట్లు) కానీ తనకు మద్దతు ఇవ్వకపోవడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారినుద్దేశించి 'మీరు వాదించకుండా.. హాయిగా కూర్చొని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోండి' అంటూ కామెంట్ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. కాగా, 'ఇరాన్ నిజంగా ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోంది. అది అమెరికాకు, మాతో ఉన్నవారికి మంచి ఒప్పందం అవుతుంది. అయితే ఈ సమయంలో.. డెమోక్రాట్లు కానీ, దేశభక్తి లేనివారిలా కనిపించే పలువురు రిపబ్లికన్లకు ఒక విషయం అర్థం కావడం లేదా? యుద్ధం విషయంలో నేను మరింత వేగంగా ముందుకెళ్లాలని, లేదా నెమ్మదిగా వెళ్లాలని, లేదా యుద్ధానికి వెళ్ళాలని, లేదా యుద్ధానికి వెళ్ళకూడదని, లేదా ఇంకేదైనా చేయాలి అని రాజకీయ దళారులు మునుపెన్నడూ లేని స్థాయిలో పదే పదే నాపై ప్రతికూలంగా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అలాంటప్పుడు నా పనిని సవ్యంగా చేయడం.. చర్చలు జరపడం నాకు చాలా కష్టతరం అవుతుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ట్రంప్‌ని తనని విమర్శించే వారిని దృష్టిలో పెట్టుకుని పరోక్షంగా.. 'మీరు హాయిగా కూర్చుని విశ్రాంతి తీసుకోండి, చివరికి అంతా మంచే జరుగుతుంది.. ఎప్పుడూ అలాగే జరుగుతుంది.. ఓపిక, విశ్వాసంతో ఉండాలి' ట్రంప్ తన ట్రూత్ పోస్టులో ప్రత్యర్థుల్ని కోరారు.


# 80 ఏళ్ల వృద్ధురాలిపై.. పొరుగు వ్యక్తి అత్యాచారం




**లక్నో జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పొరుగున నివసించే వ్యక్తి, 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు రావడం చూసి అతడు పారిపోయాడు. రక్తస్రావంతో ఉన్న ఆ వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో 80 ఏళ్ల వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని పొరుగున నివసించే 26 ఏళ్ల వ్యక్తి గమనించాడు. బలవంతంగా ఇంట్లోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.కాగా, ఆ వృద్ధురాలు సహాయం కోసం కేకలు వేసింది. దీంతో స్థానికులు అక్కడకు రావడంతో ఆ వ్యక్తి పారిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తస్రావంతో బాధపడుతున్న బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత నిందితుడైన ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వృద్ధురాలి కుటుంబం ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం -- ఆత్మగౌరవ పోరాటానికి విజయ చిహ్నం







జూన్ 2, 2014న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించడం ప్రజల చిరకాల స్వప్నానికి నెరవేర్పు. దశాబ్దాల ఉద్యమాలు, వేలాది అమరవీరుల త్యాగాలు, ప్రజల అచంచల సంకల్పం ఈ చారిత్రాత్మక విజయానికి పునాది. ప్రతి తెలంగాణ బిడ్డ గర్వంగా గుర్తుంచుకునే రోజు ఇది. 1969లో ప్రారంభమైన ఉద్యమం 2001 తర్వాత మరింత ఉద్ధృతమై విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, మేధావులు అందరూ భాగస్వాములయ్యారు. వారి పోరాటమే తెలంగాణ రాష్ట్ర సాధనకు దారితీసింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్ రంగాల్లో విశేష పురోగతి సాధించబడింది. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, పారిశ్రామిక రంగాల్లో దేశంలో ప్రముఖ కేంద్రంగా ఎదుగుతుండగా, జిల్లాల అభివృద్ధికి కూడా ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా సమతుల అభివృద్ధి సాధించబడుతోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు కొత్త గుర్తింపు లభించింది. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు రాష్ట్ర ఆత్మను ప్రతిబింబిస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. భాష, సాహిత్యం, జానపద కళలకు ప్రోత్సాహం లభించి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జాతీయ పతాక ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, అమరవీరుల స్మరణ సభలు నిర్వహిస్తారు. అమరవీరుల ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతిజ్ఞ చేస్తారు.పన్నెండేళ్లు పూర్తయిన ఈ సందర్భంలో సాధించిన విజయాలను సమీక్షించుకుంటూ, భవిష్యత్తు తరాలకు మరింత అభివృద్ధి చెందిన తెలంగాణను అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యాలతో తెలంగాణ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిద్దాం.

**జై తెలంగాణ... జై జై తెలంగాణ**

వ్యాసకర్త
కాశవేణి రాకేష్
హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి
నీలగిరి ఎక్స్‌ప్రెస్

# తమిళనాడులో మరో కొత్త పార్టీ?




**చెన్నై: జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తమిళనాడులో మరో కొత్త పార్టీ ఆవిర్భవించనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు చర్చ జరుగుతున్నది. 'నిర్భయ మనస్సులకు పరిమితులు ఉండవు' అన్న పేరుతో కోయంబత్తూరు అంతటా ఆయన పోస్టర్లు వెలిశాయి. రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాన్ని కోయంబత్తూరులో బీజేపీ నిర్వహిస్తున్న సమయంలోనే ఈ పరిణామం జరుగడం విశేషం.కాగా, అన్నామలై కొంతకాలంగా బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పటి వరకు రెండు రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాలకు ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో అన్నామలై అభిమాన సంక్షేమ సంఘమైన 'అన్నామలై అన్బు కూట్టం' కొత్త పార్టీ ఊహాగానాలకు తెరతీసింది. కొత్త సభ్యులను, కార్యవర్గ సభ్యులను చేర్చుకుంటున్నట్లు ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. అలాగే బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను ఢిల్లీలో అన్నామలై కలిసి ఆ పార్టీకి ఆయన రాజీనామా చేయనున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం చేసిన ఒక ట్వీట్ ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. 'తమిళనాడులో మరో రాజకీయ పార్టీ రాబోతోంది. మార్పులు వేగవంతమవుతున్నాయి. (ఎంఎస్ -- ప్రతిపాదిత పేరులో ఒక ఆసక్తికరమైన తర్కం ఉన్నది)' అని ఆయన ట్వీట్ చేశారు.

# రైతుల సెంటిమెంట్‌తో రాజకీయాలు వద్దు


**కాంగ్రెస్ హెచ్చరిక**




**కరీంనగర్, జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతుల కోసం రాత్రివేళ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండి స్వయంగా లారీ ఎక్కి పర్యవేక్షించిన సత్యంను వ్యంగ్యంగా విమర్శించడం సరికాదని పేర్కొన్నారు.గంగాధరలో డిగ్రీ కళాశాల, ఆర్నకొండ--మల్యాల రహదారి, కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.36 కోట్లు మంజూరు వంటి నిర్మాణాత్మక పనులు సత్యం ఆధ్వర్యంలో జరిగాయని, బీఆర్ఎస్ నేతలే కాంగ్రెస్ ప్రభుత్వ పనులను ప్రశంసించిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. రైతులపై కేసులు పెట్టారన్న ఆరోపణలు అవాస్తవమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిపైనా కేసులు పెట్టలేదని స్పష్టం చేశారు. నారాయణపూర్ సర్పంచ్ బాబా లక్ష్మి మధు మాట్లాడుతూ, గ్రామ సభలను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని, ఐకెపి సెంటర్ ఘటనకు ఎమ్మెల్యే సత్యం సంబంధం లేదని తెలిపారు. ముంపు గ్రామాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి రూ.23 కోట్ల నష్టపరిహారం మంజూరు చేయించారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మంత్రి మహేందర్, పురుమల్ల మనోహర్, ముత్యం శంకర్ గౌడ్, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, రామిడి రాజిరెడ్డి, రుద్ర మల్లేశం, సాయిని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. రైతుల సెంటిమెంట్‌తో రాజకీయాలు చేస్తే ప్రజలు క్షమించరని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.

# జమ్ముకశ్మీర్‌లో గడిచిన మూడు దశాబ్దాల్లో 'ఉగ్ర' మరణంలేని నెల ఇదే..!

**న్యూఢిల్లీ జూన్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్ముకశ్మీర్ భద్రతా చరిత్రలో ఒక చారిత్రక మైలురాయి నమోదైంది. గడిచిన మూడు దశాబ్దాలకుపైగా కాలంలో తొలిసారిగా, ఉగ్రవాద సంబంధిత హింసలో ఒక్క మరణం కూడా నమోదు కాకుండా ఒక నెల గడిచింది. జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. సౌత్ ఏషియా టెర్రరిజం పోర్టల్ వంటి స్వతంత్ర ట్రాకర్లతోపాటు అధికారిక గణాంకాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.జాతీయ మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికల ప్రకారం.. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు



మాత్రమే సంభవించాయి. అందులో 10 మంది ఉగ్రవాదులు, ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ కాలంలో ఒక్క సామాన్యుడు కూడా ప్రాణాలు కోల్పోలేదు. గతంతో పోలిస్తే ఇది చాలా మెరుగైన పరిస్థితి. ఇక ఈ మే నెలలో ఎలాంటి ఉగ్రవాద సంబంధ మరణం చోటుచేసుకోలేదు. ఉదాహరణకు 2001 మే నెలలో దాదాపు 300 మంది, 2025 మే నెలలో 43 మంది ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు నిరంతరాయంగా చేపడుతున్న కౌంటర్-టెర్రరిజం ఆపరేషన్లు, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం, ఉగ్రవాదులకు స్థానిక మద్దతు తగ్గడం వంటి కారణాలవల్లే ఈ మార్పు సాధ్యమైందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి తర్వాత భద్రతను కట్టుదిట్టం చేసి, ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉగ్ర మరణాలులేని నెలగా 2026 మే నిలవడం శాంతి, స్థిరత్వం దిశగా ఒక సానుకూల సంకేతమని నిపుణులు భావిస్తున్నారు.